



వేంకటేశ్వరుడి పాదముద్రలు

మార్చి 8 వరకు పీజీఆర్ఎస్ నిలుపుదల

కలెక్టర్ ప్రశాంతి వెల్లడి



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న మార్చి 8వ తేదీ వరకు పీజీఆర్ఎస్‌ను నిలుపుదల చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ మేరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరగదన్నారు. ఎన్నికల నియమావళి పూర్తయ్యే వరకు జిల్లా,రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో పీజీఆర్ఎస్ జరగదన్నారు. ప్రజల ఫిర్యాదుల నమోదుకు సంబంధిత సచివాలయాన్ని సందర్శించవచ్చన్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు ఫిర్యాదులు సమర్పించడానికి మీకోసం ఆన్‌లైన్ పోర్టల్ ఉపయోగిస్తామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు గ్రహించి కలెక్టరేట్, డివిజన్ , మండల కేంద్రాలకు రావొద్దని తెలిపారు.

ప్రభుత్వ బకాయిలకు ఉద్యమిస్తాం

యూటీఎఫ్ నాయకుల వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించకపోతే బకాయిల కోసం ఉద్యమిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ప్రకటించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.12వ పీఆర్‌సీ కమిషన్‌ను ప్రభుత్వం నియమించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కమిషన్ నియమించాలన్నారు. బకాయిలకు దశలవారీ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. కోశాధికారి ఈ వీఎస్ఆర్ ప్రసాద్, ఉపాధ్యక్షులు విజయగౌరీ, ఐ.రాంబాబు పాల్గొన్నారు.

మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు 8

గోదారంతా.. ఘాట్!



రాజమహేంద్రవరం పుష్కరఘాట్

పుష్కరాలకు అటూ ఇటూ ఒకటే ఘాట్

- 2027 పుష్కరాలకు ఏర్పాట్లు
- 17 ఘాట్ల విస్తరణకు యోచన
- ఇప్పటి నుంచే ప్రణాళిక
- రూ.300 కోట్లతో ప్రతిపాదన
- రాజమండ్రి వైపు 7.1 కి.మీ
- కొవ్వూరు వైపు 2 కి.మీ
- ఎంపీ పురందేశ్వరి ఆదేశాలు
- అధికారుల తర్జనభర్జన
- ఏటిగట్టు రోడ్లు నిర్మాణం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ముందస్తు చర్యలకు దిగుతున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి పరీవాహక ఘాట్లు లింక్ చేసే యోచన చేస్తున్నారు. రాజమహేంద్రవరం వైపు కాతేరు నుంచి ధవళేశ్వరం వరకూ 7.1 కి.మీ, కొవ్వూరు వైపు గోష్పాదక్షేత్రానికి అటూ ఇటూ విస్తరించనున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది.ఇప్పటి నుంచే గోదావరి పుష్కరాలకు సర్వం సన్నద్ధం కావడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలో గోదావరి పరిసర గ్రామాలన్నింటికీ పుష్కర శోభను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుంది.

గత పుష్కరాలకు ఇలా..

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవుకు దీటుగా 2003 పుష్కరాలకు కోటిలింగాల రేవును అప్పటి టీడీపీ ప్రభుత్వం 1.2 కిమీ విస్తరించింది.అప్పట్లో ఈ ఘాట్‌లోనే అత్యధికంగా భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. 2003 పుష్కరాలకు ఘాట్ల అభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయింపులు చేశారు.అప్పట్లోనే కొవ్వూరు గోష్పాదక్షేత్రం ఘాట్‌ను అభివృద్ధి చేశారు. అటుపై 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు, సర్వస్వతి ఘాట్ అభివృద్ధి చేశారు.పుష్కరాల రేవు కేవలం ప్రధాన మంచినీటి విభాగం సరిహద్దు గోడ నుంచి ఆర్చి బ్రిడ్జి వరకు మాత్రమే ఉండేది దానిని చిత్రాంగి గెస్ట్ హౌస్ వెనుక వరకు విస్తరించారు.నాటి పుష్కరాల్లో పుష్కరాల రేవు,కోటిలింగాలరేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్, కాతేరు రేవు, ధవళేశ్వరం రేవులు ప్రధాన భూమిక పోషించాయి.అయినా రద్దీ అంతా రాజమహేంద్రవరం పుష్కరాలరేవు, కోటిలింగాల రేవులపై పడేది. ఈ నేపథ్యంలో గత రెండు పుష్కరాల అనుభవాలు, ప్రస్తుతం ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి పొడవునా ఉన్న రేవులను ఈ సారి పుష్కరాలకు వినియోగించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతుంది.

రోడ్లు విస్తరణ

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రేవులకు అనుసంధానంగా ఉన్న గోదావరి బండ్ రోడ్డును విస్తరించే యోచనలో ప్రజాప్రతినిధులు అధికారులు ఉన్నారు. ధవళేశ్వరం సాయిబాబా ఆలయం నుంచి ఉన్న గోదావరి బండ్ రోడ్డును రాజమహేంద్రవరం బండ్ రోడ్డు,శేషయ్యమెట్ట మీదుగా కోటిలింగాల రేవు, కాతేరు, వెంకటనగరం మీదుగా ఏటిగట్టును బేస్ చేసుకుని గోదావరి బండ్ రోడ్డును నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పుష్కరాలకు కోట్లాదిగా తరలి వచ్చే భక్తజనం రాజమహేంద్రవరం వరకు రాకుండానే రూరల్‌లో గోదావరి బండ్ రోడ్డులోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చేసిన ఘాట్ల స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యే విధంగా బండ్ రోడ్డుకు మెయిన్ రోడ్లను కనెక్ట్ చేసి నిర్మించాలనే చర్యలు అధికారులు చేపట్టనున్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రం రేవు

2027 గోదావరి పుష్కరాలకు ఇలా..

గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు ఘాట్లలో భక్తజనం పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు ప్రధానంగా ఉన్న ఘాట్లను ఇంటర్ లింక్ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టనున్నారు. ఎంపీ పురందేశ్వరి కూడా రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఘాట్లను లింక్ చేయాలని ఆదేశించారు.ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నగరంలో ఉన్న కోటిలింగాల రేవు నుంచి కాతేరుకు, ఇటు వైపు పుష్కరాల రేవు, కుమారి ఇసుక ర్యాంప్ రేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, దోబీఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, ధవళేశ్వరం రామపాదాల రేవులను ఇంటర్‌లింక్ చేసి సుమారు 7.1 కిలోమీటర్ల పొడవునా అతిపెద్దగా ఘాట్లను నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగం చేస్తుంది. కొవ్వూరు వైపు సుమారు 3 కిలోమీటర్ల మేర అఖండ గోదావరి ఉంది. అక్కడ సుమారు 2 కి.మీ గోష్పాదక్షేత్రం నుంచి అటూ ఇటూ రేవులను విస్తరించే యోచనలో యంత్రాంగం ఉంది. 2027 గోదావరి పుష్కరాలకు ఘాట్ల ఇంటర్ లింక్‌లు కలిపి మొత్తం 17 ఘాట్లను సిద్ధం చేసేందుకు సుమారు రూ.300 కోట్లు నిధులు కేటాయింపులు చేసే యోచనలో ఉన్నారు. ఇదే జరిగితే పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానాలు చేసి వెళ్లే పరిస్థితి ఉంటుంది.అన్ని రేవులను కలిపి పుష్కరాల రేవుగా నామకరణ చేసి బోర్డులు కూడా అందరికి స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేయాలనే ఆలోచన అధికారులు చేస్తున్నారు.ఎందుకంటే 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు వద్ద తొలిరోజు జరిగిన ప్రమాదంలో 22 మంది వరకూ మృత్యువాత పడిన ఘటన విదితమే.ఈ నేపథ్యంలో ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రేవులు లింక్ చేసేయోచన చేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా ఘాట్లు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని పిండ ప్రదానాల రేవు నుంచి క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు ప్రస్తుతం 200 మీటర్ల పొడవు ఉన్నాయి. భక్తుల రద్దీ తట్టుకునే విధంగా ఘాట్లను పొడిగించాలని ఆలోచన. గోష్పాదక్షేత్రంలోని పిండ ప్రదానాల రేవు నుంచి గామన్‌బ్రిడ్జి వద్ద ఉన్న గౌతమి ఘాట్ వరకు ఒకే ఘాట్ నిర్మాణం చేపట్టాలని ఆలోచన.అది సాధ్యం కాక పోతే గోష్పాదక్షేత్రం నుంచి సుబ్రహ్మణ్య ఘాట్ వరకు 1200 మీటర్ల పొడవునా ఒకే ఘాట్.ప్రస్తుతం విజ్జేశ్వరం నుంచి పట్టిసీమ వర కు 13 ఘాట్లు ఉన్నాయి. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తాం. **- ముప్పిడి వెంకటేశ్వరరావు,ఎమ్మెల్యే, కొవ్వూరు**

రద్దీకి తగ్గట్టు ఘాట్ల విస్తరణ



2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ప్రస్తుతం జరుగుతున్న మహాకుంభ మేళాకు వచ్చిన భక్తజనానికి మించి భక్తులు వచ్చే అవకాశం ఉంది. అందుకే రద్దీకి తగ్గట్టుగా ఘాట్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటుంది. అన్ని ఘాట్లు పుష్కరఘాట్లే ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుష్కర పుణ్యమే అనే ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని రేవులకు ప్రజలు సమాంతరంగా వచ్చే విధంగా ప్రణాళికను ప్రభుత్వం చేస్తుంది. 2027 గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటి నుంచే పుష్కరాల అభివద్ధి పనులు చేపడుతున్నందున అన్ని సకాలంలో పూర్తవుతాయి.

- ఆదిరెడ్డి వాసు,ఎమ్మెల్యే, రాజమండ్రి



తంటికొండ వేంకటేశ్వరస్వామి

నేటి నుంచి తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం తంటికొండ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంక టేశ్వరస్వామి 65వ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. 9వ తేదీ వరకూ అంటే వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చున్నదొర తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ,ముగ్గుల పోటీలతో పాటు, పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ సారి కొత్తగా బ్రహ్మోత్సవాల్లో హైదరాబాద్ వారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు.

బాలికను కిడ్నాప్ చేసి.. లెక్చరర్ అత్యాచారం

జూనియర్ లెక్చరర్‌పై పోక్సో కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన ప్రైవేటు కళాశాల జూనియర్ లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన 17 సంవత్సరాల బాలిక రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. అదే కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తిరుపతికి చెందిన వినయ్‌వర్ధన్ ఈ నెల 28వ తేదీన బాలికను మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 29వ తేదీన పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం బాలిక అతని వద్ద ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు మిస్సింగ్ కేసును ఆదివారం పోక్సో కేసుగా మార్చినట్టు ఎస్ఐ తెలిపారు.



గోకవరంలో వర్రీయే!

పండిన ప్రతి గింజనూ కొంటాం..48 గంటల్లో సొమ్ము జమ చేస్తాం. ఇదీ అధికారులు .. నాయకుల మాట.. లక్ష్యం మేరకు కొనుగోళ్లు జరిపారు.. అయితే ఎక్కడి పంట ఎక్కడైనా అమ్ముకోవచ్చనే నిబంధన కారణంగానో ఏంటో గోకవరం మండలంలో 8 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది.ఆ ధాన్యం చాలా కాలం కిందటే మిల్లులకు తరలించినా ఇంకా సొమ్ములు మాత్రం జమకాలేదు.. దీంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- రైతుల వద్ద 8 టన్నుల ధాన్యం
- డిసెంబరులో మిల్లులకు తరలింపు
- ఇంకనూ జమకాని డబ్బులు
- లబోదిబోమంటున్న రైతాంగం

గోకవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు కొత్త కష్టం వచ్చి పడింది. పండిన పంటను విక్రయించుకునేందుకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు విడుదల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత కొంత కాలంగా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణను పూర్తిగా నిలిపేసింది. జిల్లా టార్గెట్ పూర్తయిందన్న షాకుతో ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ప్రభుత్వం ఆపేసింది. దీంతో తమ వద్ద ఉన్న ధాన్యం ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో రైతాంగం కొట్టుమిట్టాడుతున్నారు. కొంత మంది రైతులు డిసెంబరు నెలలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడడంతో అనధికారికంగా రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని పంపేశారు. కానీ మిల్లర్లకు కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో రైతుల ఖాతాలో ఇంత వరకూ డబ్బులు జమకాలేదు. దీంతో బాధిత రైతాంగం డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాలంటూ ప్రస్తుతం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మండలంలో 48 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయగా కూటమి ప్రభుత్వంలో 40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించి చేతులు దులుపేసుకుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గోకవరం మండలంలో రైతుల వద్ద ఇంకనూ 8 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

టార్గెట్ పూర్తయిపోయింది..

టార్గెట్ పూర్తవ్వడం వల్ల రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించలేకపోతున్నాం.ప్రభుత్వం నుంచి అనుమతి లభించే వరకు రైతులు ధాన్యం తమ వద్దే ఉంచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా ధాన్యాన్ని మిల్లర్లకు పంపి ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.

- సాయిప్రసాద్, తహశీల్దార్, గోకవరం

దాదాగిరి.. దందాలు..



జిల్లాలో రెచ్చిపోతున్న రౌడీమూకలు

- ఇంకనూ ఆగని సెటిల్‌మెంట్లు
- కూటమి సర్కారులోనూ ఇదే తీరు
- కన్నెత్తిచూడని పోలీసులు
- రౌడీలకు రాజకీయ రంగు
- మళ్లీ భయపడుతున్న జనం
- లా అండ్ ఆర్డర్‌కు సవాల్
- 7 నెలల్లో 70 మందిపై రౌడీషీట్
- అయినా మారని తీరు
- జిల్లాలో పెరుగుతున్న నేరాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రౌడీమూకలు రెచ్చిపోతున్నాయి.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. అయినా పోలీసులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజమహేంద్రవరం కేంద్రంగా రౌడీ మూకలు విచ్చలవిడిగా పెరిగాయి. నగరంలో ఒంటరిగా తిరగాలంటేనే భయపడేంతగా జనం వణికిపోయారు. అమ్మో రాజమహేంద్రవరం అన్నారు. ఎందుకంటే ఎటు చూసినా బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలే. కూటమి ప్రభుత్వం రావడంతో ఆ బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు తగ్గినా రౌడీమూకల ఆగడాలు మాత్రం అలాగే ఉన్నాయి. అయినా పోలీసులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

రెచ్చిపోతున్న రౌడీమూకలు..

ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీకి సంబంధంలేని రౌడీషీటర్లు సైలెంట్‌గా ఉండగా గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ అండతో రెచ్చిపోయిన కొంత మంది మాత్రం ఇప్పటికీ చెలరేగిపోయి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.జిల్లాను అనేక ఘర్షణలకు కేంద్రంగా మార్చివేస్తున్నారు.లాండ్ ఆర్డర్‌కు సవాల్ చేస్తూ అన్ని అసాంఘిక కార్యకలాపాల్లో తలదూర్చి దందాలు చేస్తున్నారు. చిన్న తగాదా మొదలుకొని పెద్దపెద్ద సెటిల్‌మెంట్ల వరకు యథేచ్ఛగా రూల్స్‌ను బ్రేక్ చేస్తున్నారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా వీక్ చేస్తున్నారు. గత ఎన్నికల్లో నగరంలో ఒకరిద్దరు రౌడీషీటర్లకు గట్టిదెబ్బతగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గొంతులో వెలక్కాయపడినట్లయింది. ఇదంతా కేవలం నెలరోజులు మాత్రమే.. ఎందుకంటే ఆ నెలా సైలెంట్ అయిన వారు అటుపై మళ్లీ తమ హవా కొనసాగించేందుకు తెరమీదకు వస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా చాపకింద నీరులా తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. రౌడీ షీటర్ అనే ముద్రను తొలగించుకునేందుకు వారికి అండగా నిలిచిన పార్టీ పదవులను పొంది ప్రజల్లోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో రోడ్లపై పొడుచుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా చాలా మంది మహిళలను భయపెట్టిన చరిత్ర ఉన్న వాళ్ళు వాటిని చెరుపుకునే ప్రయత్నం చేస్తున్నారు.అయితే వారిలో ఉన్న నేర స్వభావం వారిని ఊరకనే ఉండనివ్వదు కాబట్టి అడపాదడపా అసాంఘిక పనులు చేసుకుంటూ మళ్లీ తెరపైకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల వైసీపీకి చెందిన రౌడీషీటరు ఒక మహిళను ట్రాప్ చేశారు. ఆ మహిళ చేత ఆమె కుటుంబంలో చిచ్చుపెట్టించి గందరగోళం సృష్టించాడు. చివరికి ఆమెకు ఆమె భర్తకు మధ్య పెద్ద అగాధం సృష్టించాడు. ఇటువంటి వారిని అరికట్టడంతో కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజమహేంద్రవరంలో కొత్తగా సుమారు 70 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. కానీ గత ఐదేళ్లలో విచ్చలవిడిగా వ్యవహరించిన వారిపై చర్యలు కానరావడం లేదు. దీంతో రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి..మళ్లీ రోడ్డెక్కుతున్నాయి.



రాజమహేంద్రవరంలో అధికారులకు సూచనలు చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర పాటిల్

గోదావరి పుష్కరాలకు సన్నద్ధం కావాలి

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ తనిఖీలో డీఆర్ఎం నరేంద్ర పాటిల్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రానున్న పుష్కరాల రద్దీకి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేంద్ర ఎ.పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల మూడో వారంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీకి రానున్న నేపథ్యంలో ఆదివారం డీఆర్ఎం,ఏడీఆర్ఎం శ్రీనివాసరావుతో కూడిన ఉన్నతాధికారుల బృందం రైల్వేస్టేషన్‌ని పరిశీలించింది. డీఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం రూ.270 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పుష్కరాల నాటికి పూర్తి కావాల్సి ఉందన్నారు.గతిశక్తి బ్లూప్రింట్‌ని పరిశీలించి ఎక్కడెక్కడ ఏమేమి సదుపాయాలు వస్తాయో ఆరా తీశారు. ఐదు ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు సంచరించే ప్రదేశాలను చూశారు.తూర్పు రైల్వే స్టేషను వైపు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇటువైపు ఐదు అం తస్తుల భవనం రానున్న నేపథ్యంలో అవసర మైతే జీఎం వచ్చినప్పుడు ఆయనతో శంకుస్థాపన చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. పరిశుభ్ర తలో రాజీ పడొద్దని ఆదేశించారు.భద్రతకు తొలి ప్రాధా న్యం ఇవ్వాలన్నారు.రోడ్ కం రైలు బ్రిడ్జిని తనిఖీ చేశారు.



స్వామివారి సేవలకు..

సిద్ధమైన వాహనాలు

- ఒక్కో వాహనానికి ఒక్కో ప్రత్యేకత
- రేపటి నుంచి 13వ తేదీ వరకు వైభవంగా లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలు
- ఏర్పాట్ల నిమగ్నమైన అధికార యంత్రాంగం



అంతర్వేది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి పది రోజులపాటు నిర్వహించే కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పది రోజులపాటు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి 14 వాహనాల్లో గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. ఆర్తజన రక్షకుడైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహుడికి పది రోజులపాటు జరిగే కల్యాణోత్సవాలను చూసేందుకు రెండు కనులు చాలవు. వీటిని చూసి తరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామి వారికి జరిగే ముద్రికాలంకరణతో ప్రారంభమై స్వామివారి పవళింపు సేవతో ముగుస్తాయి.

కల్యాణోత్సవాల కోసం వాహనోత్సవాలు

సూర్యవాహనం



కల్యాణోత్సవాల్లో తొలిరోజు ఫిబ్రవరి 4న మంగళవారం రథసప్తమినాడు స్వామివారికి సూర్యవాహనంపై ఊరేగింపు జరుగుతుంది. సూర్యుడు వెలుగునిచ్చే జ్ఞాన ప్రధాత. మనుషుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానం అనే వెలుగును నింపేందుకు కోటి సూర్య ప్రభాససమేతుడైన శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు సాయంత్రం 4.30కు సూర్యవాహనంపై గ్రామ మాడ వీధుల్లో ఊరేగుతారు.

గరుడ పుష్పకవాహనం



రెండో రోజు 5వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు గరుడ పుష్పకవాహనంపై ఊరేగుతారు. గరుడు వేదమూర్తి స్వామివారి వాహనం నిత్యం స్వామి వారికి గరుడవాహనం ఎక్కి గ్రామోత్సవంలో పాల్గొంటారు.

పుష్పక వాహనం



రెండోరోజు బుధవారం రాత్రి 7గంటలకు స్వామివారు పుష్పక వాహనం అధిరోహిస్తారు. భక్తుల మనో రథాన్ని నెరవేర్చడం కోసం శ్రీ స్వామివారు తన హృదయమనే పుష్పంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటి చెప్పేందుకు ఈ వాహనంపై ఊరేగుతారు.

హంస వాహనం



మూడో రోజు 6వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామివారు హంస వాహనంపై ఊరేగింపుగా వెళ్తారు. పాలు, నీళ్లను వేరు చేసే శక్తి హంసకు మాత్రమే ఉంది.

శేష వాహనం



మూడోరోజు గురువారంరాత్రి 7 గంటలకు శేషవాహనంపై ఊరేగుతారు. శిష్యుడు వాక్తిమ కలిగిన వారు. సర్వ హక్కులకు అధినేత అయిన వాక్ బ్రహ్మను నేనే అని భక్తులకు తెలియజెప్పేందుకు ఆదిశేషుడిపై వేంచేస్తారు.

పంచముఖాంజనేయ వాహనం



నాల్గవరోజు 7వ తేదీ శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్వామివారు అధిరోహించే వాహనం పంచ ముఖాంజనేయ. బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, భయం లేకుండుట అనే గుణాలను భక్తులకు పంచిపెట్టడం కోసం శ్రీవారు పంచముఖ ఆంజనేయ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు

కంచు గరుడ వాహనం



నాల్గవరోజు శుక్రవారంరాత్రి 8 గంటలకు కంచు గరుడవాహ నంపై అధిరోహించి భక్తులకు వినత, దాత్యమును పోగొట్టేందుకు తాను ప్రయత్నించి గరుడు సఫలీకృతమై శ్రీ స్వామివారి అనుగ్రహం పొందేందుకు పంచ గరుడ వాహనంపై గ్రామోత్సవానికి వెళతారు. అదేరోజు రాత్రి దశమి 12.55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నమందు స్వామివారి తిరు కళ్యాణం జరుగుతుంది. ఐదోరోజు 8వతేదీ శనివారం భీష్మఏకాదశి పర్వదినాన మధ్యాహ్నం 2.05 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం.

గజ వాహనం



ఆరోరోజు 9వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు గజ వాహనాన్ని అధిరోహించి ఊరేగు తారు. గజం బుద్ధికి సంకేతం. తాను వేయాల్సిన ప్రతి అడుగు భాగుగా ఆలోచించి భక్తి, జ్ఞాన వైరాగ్యం వైపు భక్తులను నడిపించేందుకు శ్రీ లక్ష్మీనరాసింహస్వామి వారు గజ వాహనంపై ఊరేగింపునకు వెళ్తారు.

పొన్న వాహనం



ఆరో రోజు ఆదివారం రాత్రి 8 గంటలకు స్వామివారు పొన్న వాహనంపై గ్రామోత్సవానికి వెళతారు. నాది అనేద ఏదీ లేదని సర్వస్వం నేనే అని గోపికలు కృష్ణ పరమాత్మునికి ఆత్మ నివేదన చేసిన సమయంలో శ్రీ కృష్ణ పరమాత్మపై పొన్న చెట్టుపై కూర్చుని వారి నివేదనను స్వీకరిస్తారు.

హనుమత్ వాహనం



ఏడవ రోజు 10వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు హనుమత్ వాహనంపై ఊరేగింపునకు వెళతారు. హనుమంతుడు కార్యం చేయాల్సి వచ్చినప్పుడు తన దైవాన్ని స్మరించుకు ని పూర్తి చేస్తాడు. హనుమంతుడు స్వామివారిని తన భుజాలపై అధిరోహింప చేసుకుని శ్రీలక్ష్మీ నరసింహరాముని తలచుకుని భక్తులు తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి చేయవచ్చని హనుమత్‌వాహనంపై ఊరేగుతారు.

సింహ వాహనం




ఏడోరోజు సోమవారం రాత్రి 7గంటలకు సింహవాహనం అధిరోహిస్తారు. మానవుడు, మాధవుడు కలిసిన స్వరూపమే శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు. అతి మాధవ స్వరూపం సింహం నేనేనని శ్రీకృష్ణపరమాత్మడు చెప్పినట్టుగా లక్ష్మీనరసింహ స్వామి వారు సింహంపై అధిరోహిస్తారు.

రాజాధిరాజ వాహనం



ఎనిమిదో రోజు 11వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటలకు స్వామి వారు రాజాధిరాజా వాహ నంపై ఊరేగింపునకు వెళ్తా రు.

అశ్వవాహనం



ఎనిమిదోరోజు మంగళవారంరాత్రి 7 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారిచే నిర్మితమైన అశ్వవాహనాన్ని స్వామివారు అధిరోహిస్తారు. మనిషిలో ఉండే జ్ఞానం జడ పదార్థంగా ఉండకుండా గుర్రం వలే చురుకుదనం త్వరితతగతిన విచ్చేందుకు స్వామివారు అశ్వ వాహనంపై దర్శనమిస్తారు.

- తొమ్మిదో రోజు 12న బుధవారం మాఘ పౌర్ణమినాడు ఉదయం 8గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- పదోరోజు 13 సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వా మివారి గ్రామోత్సవం జరుగుతుంది.

కొంకాపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఐషర్‌వ్యాన్.. ఆటో ఢీ.. ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఒక యువతి పరిస్థితి విషమం
- కిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న బాధితులు



తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో పడి ఉన్న నలబ శ్రీదేవి





చికిత్స పొందుతున్న మానుపాటి దుర్గ, గాయపడ్డ వనుము కిశోర్

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లిలో గల ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వారిలో ఒక యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆటో, రొయ్యల ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన ఐషర్ వ్యాన్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం పట్టణంలోని మున్సిపల్ కాలనీకి చెందిన కొందరు ఆదివారం సెలవురోజు కావడంతో అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణికులతో అమలాపురం వైపు వస్తున్న ఆటోను భీమవరంవైపు వెళుతున్న రొయ్యల కంపెనీకి చెందిన ఐషర్ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. దాంతో ఆటోలో ఉన్న ఎనిమిది మందిలో ఏడుగురికి గాయాలు కాగా ఒక బాలిక మాత్రం సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడింది.

ఆటో ముందు, పక్కభాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. అయితే సంఘటనా స్థలివద్ద గాయపడ్డ వారి ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. రక్తపు మడుగులో ఉన్న బాధితులను స్థానికుల సహకారంతో 108 అంబులెన్సు వాహనంలో తొలుత అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం బాధితులను కిమ్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన బాధితుల్లో అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన నలబ శ్రీదేవి (16) పరిస్థితి విషమంగా ఉంది. తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరగడంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. మిగిలిన వారి వివరాలు ఇలా.. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మానుపాటి నాగేంద్ర (38), మానుపాటి దుర్గ (35), వనుము కిశోర్ (16), మానుపాటి నాని (14), మానుపాటి దివ్య (6), వనుము కిరణ్ (12), ఆటోడ్రైవర్ మొగిలి మహేష్ (20) తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు విరిగిపోవడం, తలకు గాయం కావడం వంటి సమస్యలతో బాధితులు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు ఘటనాస్థలాన్ని సందర్శించి కేసు విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు. ఓడలరేవులో సరదాగా గడిపి మరికొన్ని క్షణాల్లో ఇంటికి చేరకుంటామన్న తరుణంలో ఈప్రమాదం జరగడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరంతా ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారు.

పిఠాపురంలో అంతర జిల్లా నేరస్తుడి అరెస్టు

- 48 మోటార్‌సైకిళ్లు స్వాధీనం
- కాకినాడ, అనకాపల్లి జిల్లాల కేసుల్లో అరెస్టు
- అదుపులో ఆరుగురు కొనుగోలుదారులు
- వెల్డింగ్ పని చేస్తూ వ్యసనాలకులోనై చోరీలు
- వెల్లడించిన కాకినాడ ఎస్పీ బిందుమాధవ్





పిఠాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు, అంతరజిల్లా నేరస్తుడిని అరెస్టు చూపుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతరజిల్లా నేరస్తుడిని పిఠాపురం పోలీసులు అరెస్టుచేసి 48 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోటార్‌సైకిళ్లను కొనుగోలు చేస్తు న్న ఆరుగురుని ముద్దాయిలుగా చేర్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం పట్టణం, రూరల్, కొత్తపల్లి, గొల్లప్రోలు, సర్పవరం, తునిటౌన్, తొండంగి, అన్నవరం పోలీసుస్టేషన్లు, అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 48కిపైగా మోటార్‌సైకిళ్ల చోరీకి గురయ్యాయి. చోరీలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐలు, క్రైమ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఇతను మంకీకేప్, మాస్క్ ధరించి ముఖం కనబడకుండా కొంతకాలంగా బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న సంఘటనలు జరగడంతో ఈ కేసులను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సంక్రాంతి రోజున జరిగిన బైక్ చోరీ సంఘటనలో సీసీ కెమెరాలు, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి పిఠాపురం పట్టణం అగ్రహారం ప్రాంతానికి చెందిన సొంటిని గంగాధర్ అలియాస్ రీసు గంగాధర్‌ను అరెస్టుచేశారు. విచారించగా ఇతను రెండేళ్ల కాలంలో తొమ్మిది పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. 48 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇతను గతంలో కూడా చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పిఠాపురం పట్టణంలో నమో దైన 15 కేసుల్లో ఇతనిని అరెస్టు చూపించారు. ఇతని వద్ద నుంచి మోటార్‌సైకిళ్ల కొనుగోలుచేసి ఇతరులకు విక్రయిస్తున్న ఆరుగురుని గుర్తించి వారిని ముద్దాయిలుగా చేర్చి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ప్రస్తుతం విచారిస్తున్నారు. గంగాధర్ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగించే వాడు. వ్యసనాలకులోనై కొంతకాలంగా చోరీలకు అలవాటు పడినట్లు చెబుతున్నారు. ఇతనికి ఎవరైనా సహకరించారా అనే అంశంపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును పకడ్బందీగా విచారించి నిం దితుడిని అరెస్టు చేసి భారీగా మోటార్‌సైకిళ్ల స్వాధీనం చేసుకున్న సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీభాషా పాల్గొన్నారు.

పరిచయం పెంచుకుని బైక్‌లు అమ్మాడు

మోటార్‌సైకిళ్లకు చోరీకి పాల్పడిన గంగాధర్ ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో దొంగలించిన బైక్‌లు కొని అమ్మేవారితో 2023 నుంచి పరిచయాలు పెంచుకున్నాడు. పెళ్లయిన తర్వాత చెడు అలవాట్లకు లోనయిన గంగాధర్ నకిలీ తాళాలు ఉపయోగించి మోటార్ సైకిళ్లను చోరీ చేసేవాడు. ఈవిధంగా చోరీ చేసిన బైక్‌లను రెండు మండలాలకు చెందిన కార్తిక సత్తిబాబు, కురుమళ్ల వీరబాబు, గనాసుల ఆనంద్, తోట లక్ష్మణరావు, ఏనుగపల్లి నాగ సత్యనారాయణ, వట్టికోళ్ల చక్రయ్యలకు ఒక్కొక్క బైక్‌ను రూ.10వేలు వంతున విక్రయించే వాడు. వచ్చిన సొమ్మును జల్సాలుకు వినియోగించే వాడు. ఈఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు అదుపులోకి తీసుకున్నారు

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



నిమ్మన శివనాగకృష్ణ (ఫైల్)

ముమ్మిడివరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యం కేసులో పోలీసులు వేధింపులకు గురి చేయడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం గేదెల్లంకలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముమ్మిడివరం మండలం గేదెల్లంకకు చెందిన నిమ్మన శివనాగకృష్ణ (32) భార్య సాయిరేవతి, తల్లిదండ్రులు వెంకటరమణ-శేషగిరిరావుతో కలిసి హైదరాబాద్ ఎల్బీనగర్ మనుసూరాబాద్‌లో పండ్లు, జ్యూస్ వ్యాపారంపెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అక్కడ ఓ వివాహిత అదృశ్యం కావడం.. ఆమె భర్త పోలీసు శాఖలో పనిచేయడంతో.. శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించడంతో మనస్తాపం, భయాందోళన చెంది శివనాగకృష్ణ హైదరాబాద్ నుంచి శనివారం స్వగ్రామం గేదెల్లంక వచ్చాడు. శివనాగకృష్ణ శనివారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అతడిని బంధువులు మురమళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. శివనాగకృష్ణ సుమారు 15 ఏళ్లుగా తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ ఎల్బీనగర్ మనుసూరాబాద్‌లో పండ్లు, జ్యూస్‌లషాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. 11 నెలల క్రితం సాయిరేవతితో వివాహమైంది. పెళ్లి అయిన తరువాత భార్యను కూడా హైదరాబాద్ తీసుకువెళ్లాడు. ఇటీవల అక్కడ పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉద్యోగి భార్య అదృశ్యం వెనుక శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించడంతో మనస్తాపం, ఆందోళన చెందిన శివనాగకృష్ణ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని బంధువులు చెబుతున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నవోదయలో 9,11 తరగతిలో ప్రవేశానికి పరీక్ష

పెద్దాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయలో 9,11 తరగతిలో ప్రవేశానికి ఈనెల 8న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు నవోదయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. ఈప్రవేశ పరీక్ష పెద్దాపురంలో 9 సెంటర్లలో జరుగుతుందన్నారు. తొమ్మిదో తరగతికి 1451మంది, 11వ తరగతికి 699 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

గ్లకోమాను సకాలంలో గుర్తించాలి

- జీఎస్ఎల్‌లో అంతర్జాతీయ సదస్సులో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

రాజానగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్లకోమా అంతర్జాతీయ సదస్సును గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సహకారంతో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా జాన్స్ హాప్ కిన్స్ యూనివర్శిటీ (యుఎస్ఏ)కి చెందిన డాక్టర్ థామస్ వి.జాన్సన్ ధనవంత్రి గురించి వివరించారు. గ్లకోమాలో న్యూరోప్రొటెక్షన్, గ్లకోమాకు సంబంధించిన సమస్యలను వివరించారు. గ్లకోమా, రెటీనీ కణాల మార్పిడి గురించి తెలియజేశారు. కార్నెల్ మెడ్ సెంటర్ న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ చార్లెస్ కోల్ సుశ్రుత కీలకోపా న్యాసం చేశారు. గ్లకోమా కోసం శస్త్రచికిత్స సమయాల్లో తీసుకునే సాహసాల, విధానాలపై వివరించారు. గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన డాక్టర్ ఎ.ప్రశాంత్ కుమార్, సీనియర్ వైద్య నిపుణులు గ్లకోమా రోగులకు లేజర్ చికిత్స, విధి విధా నాలపై ప్రదర్శన ద్వారా వివరించారు. బాలల అంధత్వాన్ని నిర్మూలించడం కోసం ప్రత్యేకంగా అందిస్తున్న సేవలను యుఎస్ నుంచి విచ్చేసిన పారిశ్రామిక వేత్త, వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీను మద్దుల కార్నియా స్పెషలిస్ట్ గౌతమి ఐ ఇన్‌స్టి ట్యూట్ చైర్మన్ డాక్టర్ వీకె రాజును ప్రశంసించారు. అమెరికాకు చెందిన డాక్టర్ లీలారాజు ముఖ్యఅతిథులను పరిచయం చేస్తూ సదస్సు ప్రాధాన్యతను వివరించారు. పలు విద్యాసంస్థలకు చెందిన ఆప్తమాలిక్ మెడికోలు, విద్యార్థులకు కంటి వ్యాధులపై ప్రదర్శనలు ద్వారా వివరించారు. అనంత రం గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ చాన్సలర్ కేవీవీ సత్య నారాయణరాజు (చైతన్యరాజు)ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గౌతమి మేనేజర్ డైరెక్టర్ వీవీ కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నయన కంటి ఆసుపత్రి వైద్యుడు శ్రీరాం, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ డాక్టర్ ప్రజ్ఞ పరిశీలకులుగా వ్య వహరించారు.

నల్లకుంటలో మూడిళ్లు బుగ్గి

- రూ.15 లక్షలు ఆస్తి నష్టం

ఎటపాక, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంటలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు బుగ్గి అయ్యాయి. రూ.15లక్షల ఆస్తి నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తొలుత ఊయిక వీరమయ్య ఇంటికి నిప్పంటుకుంది. ఆమంటలు దావానంలా వ్యాపించి పక్కనే ఉన్న తెల్లం రాములమ్మ ఇంటికి నిప్పంటుకుంది. ఆపైన కలముల ధనలక్ష్మి ఇంటికి మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన బాలింత ధనలక్ష్మి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చారు. ఆలోపే ఇళ్లన్నీ కాలిపోయాయి. రాములమ్మ ఇంట్లోని మూడు కాసుల బంగారంతో పాటు ధాన్యం బస్తాలు, గృహోకరణాలు దగ్ధమయ్యాయి. ఊయిక వీరమయ్య ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.1.50లక్షల నగదుతో పాటు బంగారం, ధాన్యం,పట్టాదారుపాస్‌పుస్తకాలు, గృహోపకరణాలు కాలిపోయాయి. ధనలక్ష్మి ఇంటి బీరువాలోని బంగారు తాడు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీఆర్వో కన్నమ్మ నష్టాన్ని అంచనా వేసి పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంతో మూడు కుటుంబాలకు చెందిన గిరిజనులు కట్టుబట్టలతో మిగిలారు.

మాజీ మంత్రి ముద్రగడ ఇంటి వద్ద ఉద్రిక్తత

- ఇంటి గేటును ఢీకొట్టిన మతిస్థిమితం లేని వ్యక్తి
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



దాడికి కారణమైన యువకుడు

కిర్లంపూడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి నివాసంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగుగంటల సమయంలో ఒక యువకుడు బీభత్సం సృష్టించాడు. ర్యాంపుపై ఉన్న కారును ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడు. ఈ అలజడికి ఇంట్లో నుంచి ముద్రగడ కుటుంబీకులు బయటకు వచ్చారు. అక్కడున్న వారు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడిని మండలం జగపతినగరం గ్రామానికి చెందిన గనిశెట్టి గంగాధర్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ సిబ్బందితో ముద్రగడ నివాసానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కిర్లంపూడి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ముద్రగడను కలిశారు. మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, తోట నరసింహం, చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ వంగా గీత ముద్రగడ పద్మనాభం, గిరిబాబులను కలిసి ఏం జరిగిందని ఆరా తీశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం


విరాళం అందజేస్తున్న రామారావు దంపతులు

సామర్లకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవాదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యా న్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్యనిర్వాహక ఇంజనీరు జె. రామా రావువాణి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఈవో బళ్ల నీలకంఠానికి ఆదివారం అందజేశారు. ఈవో ఆధ్వర్యంలో దాత దంపతులకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్ర పటాన్ని అందజేశారు. ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశే ఖరశర్మ, వెంకన్న, అంజిబాబు పాల్గొన్నారు.

సమత సేవా సమితి సంచిక ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సమత సేవా సమితి 30 ఏళ్లగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిందని హైదరాబాద్ ఎన్ఐఆర్డీ ఆచార్య కె.సుమన్ చంద్ర అన్నారు. సమతాసేవా సమితి ప్రస్థానాన్ని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక సంచికను రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకుడు మేడిశెట్టి తిరుమల కుమార్, జగదీశ్వరరావు, సానబోయిన రామారావు, కనకం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు పెద్దపట్నాపు గంగాధరరావు, గుమ్మడి సమర్పణరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ పేరు కూడా ఉచ్చరించలేదని, నిధులు తూతూమంత్రంగా కేటాయించి అన్యాయం చేశారని సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ విమర్శించారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. రాష్ట్ర ప్రజల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లిందన్నారు. బడ్జెట్‌లో కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేసి, ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేయడం మంచి సంస్కృతి కాదన్నారు.

సమతుల బడ్జెట్: గోపి శ్రీనివాస్

కేంద్ర బడ్జెట్ అంత్యోదయ బడ్జెట్ అని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్ ద్వారా అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. గొప్ప బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టారన్నారు.

క్లాత్ సంచుల వినియోగంపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణ సమతుల్యతను కాపాడడంలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల రైతుబజార్ (వై.జంక్షన్) ఎదుట పాలిథీన్ బ్యాగుల వినియోగం మానుకుందాం, క్లాత్ సంచులను మాత్రమే వాడదాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రైతు బజార్‌కు వచ్చిన వినియోగదారులకు ఉచితంగా క్లాత్ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారు మెహర్ మధు, ట్రస్టు అధ్యక్షుడు తమ్మా రవి, కోశాధికారి సూర్య, జాయింట్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి కేఎంఎంఆర్.ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్లీనంకు హాజరై మాట్లాడారు. చెడు అలవాట్ల నుంచి యువతను కాపాడుకోవడానికి వేదిక పనిచేయాలని కోరారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవిబాబు, ఉపాధ్యక్షులుగా వసంతరావు, ఏఎస్ సుధారాణి, శ్రీరాములు, కోశాధికారిగా తాతారావు, గౌరవాధ్యక్షులుగా మల్లికార్జునరావు, ఫైడియ్య, డాక్టర్ చైతన్య శేఖర్, మరికొందరు సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రజకుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : వాసు


రామాలయం వద్ద బల్లల పండుగలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 23వ డివిజన్ రామాలయం వద్ద ఆదివారం జరిగిన బల్లల పండుగకు హాజరై గంగాలమ్మకు పూజలు చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రజకుల సంక్షేమానికి ఆదరణ పథకం కింద పనిముట్లు పంపిణీ చేశామన్నారు. వైసీపీ ఆ పథకాన్ని తుంగలోకి తొక్కి రజకులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రజకులను అన్ని విధాలా ఆదు కుంటుందని చెప్పారు. కార్యక్రమంలో రజక పెద్దలు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కళాతపస్వి కె.విశ్వనాథ్ ద్వితీయ వర్ధంతిని ఆదివారం జిత్ మోహన్ మిత్రి కళా వేదికలో నిర్వహించారు. జిత్ మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రా గాయకులు విశ్వనాథ్ చిత్రాల్లోని గీతాలు ఆలపించి నివాళులర్పించారు. మిత్ర బృందం తరపున విశ్వనాథ్ చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జల్లి శివ ప్రసాద్, సుక్కిరెడ్డి శ్రీనివాస్, పీవీఎస్.కృష్ణారావు, బి.సీతారామారావు, నాగేంద్ర, డాక్టర్ హరి, సామ్రాట్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సేవ్ గోదావరి కార్యక్రమం

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్‌కు చెందిన 80 మంది వలంటీర్లు ఆదివారం సేవ్ గోదావరి కార్యక్రమం నిర్వహించారు.పుష్కర్ ఘాట్ వద్ద నదిలో వ్యర్థాలను తీసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, డీఎస్పీ కె.రమేష్‌బాబు, పీవీఎస్ కృష్ణారావు, కె.సుధాకర్ పట్నాయక్, చందనరాజు, ఎంహెచ్‌వో వినూత్న పాల్గొన్నారు.

సీఆర్‌పీల సమస్యల పరిష్కారానికి కృషి

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరం



సమావేశంలో మాట్లాడుతున్న పేరాబత్తుల రాజశేఖరం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీల ఉద్యోగ భద్రత, కనీస వేతనాల అమలు వంటి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఆదివారం సాయంత్రం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా సీఆర్‌పీ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గిరి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎం.రఘునాథ్, స్టేట్ సీఆర్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ తవిటి నాయుడు, సెక్రటరీ యు.సాయి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి పూసలరావు పాల్గొన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణపై దృష్టిసారించాలి

ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలల పరిరక్షణపై విద్యార్థులు దృష్టి సారించాలని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమి డైరెక్టర్ బి.విజయకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం వృక్ష, భూగర్భ, జంతుశాస్త్ర విభాగాలు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహించాయి. విజయకుమార్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చిత్తడి నేలల గురించి వివరించారు. చిత్తడి నేలల పరిరక్షణకు విద్యార్థులు ప్రచారం చేయాలని సూచించారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఏవీ రమణమూర్తి, వృక్షశాస్త్ర హెచ్‌వోడీ ఎశ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూరల్ జనసేన కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న త్రినాథ్, మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలో జూరా హోటల్ పక్కన ఏర్పాటు చేసిన జనసేన పార్టీ రూరల్ కార్యాలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మేడా దత్తత్రినాథ్ చేతుల మీదుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఆచంటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వేణు



రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆచంట పరిశీలకుడిగా నియమితులైన టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి చర్చించారు. కూటమి విజయానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రచారం తదితర అంశాలపై చర్చించారు. ఈ మేరకు యర్రా వేణు ఒక ప్రకటన విడుదల చేశారు.

మంద కృష్ణ కృషితో ఎస్సీ వర్గీకరణకు బీజం

మాదిగ రక్షణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్

చీపురుగూడెంలో మంద కృష్ణ అభినందన సభ

'లక్ష డప్పులు-వేల గొంతులు' పోస్టర్ విడుదల



నల్లజర్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణకు బీజం పడిందని మాదిగ రక్షణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కండెల్లి శేఖర్ అన్నారు. మంద కృష్ణకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆదివారం చీపురుగూడెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మోదుగ సుబ్బారావు, వసంతాడ ఆనందస్వరూప్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మంద కృష్ణ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందించిందన్నారు.మాదిగలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు-వేల గొంతులు మహా ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గెరా శ్రీను, పెనుమాక వెంకటరత్నం, రాజేశ్వరరావు, యర్రా జగదీష్, మోదుగ ధర్మరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

← చీపురుగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేఖర్

15న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

రాజానగరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఈనెల15న వైభవంగా నిర్వహించనున్నారు. 13న గ్రామోత్సవం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రక్షాబంధనం, రుత్విక్‌వరుణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధన క్రతువులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా జరుగనున్నాయి. 14న గణపతి పూజ, పుణ్యాహవచనం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, గణపతి హోమం, 15న పునఃపూజలు అనంతరం ఉత్తర నక్షత్ర మేషలగ్నంలో ఉదయం 10.54 గంటలకు ఆలయ స్వామి, అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను గ్రామ పురోహితులు భవానీభట్ల వెంకట సూర్య సుబ్రహ్మణ్యశాస్త్రి బ్రహ్మత్వంలో శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహిస్తారు.

ఘనంగా శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు

రంగంపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి శతజయంత్యుత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంగంపేట, ఈలకొలను, కోటపాడు గ్రామాల్లో శ్రీసత్యసాయి మందిరాల్లో బలవికాస్ విద్యార్థినీ, విద్యార్థులు సత్యసాయి పాదుకలకు, చిత్రపటానికి బియ్యంతో పూజలు చేశారు. కార్యక్రమంలో రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు, సేవా సమితి కన్వీనర్లు కందర్ప వెంకట అమర్నాథ్, తిక్కిశెట్టి సుబ్బారావు, జిల్లా ఇన్‌చార్జ్ పోతుల ఈశ్వరరావు, వేదాధ్యయన సమన్వయకర్త కందర్ప శ్రీరామ్‌శర్మ, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, సేవాదళ్ సభ్యులు బాలవికాస్ గురువులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో మహాలక్ష్మీ హోమం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లో కొలువైఉన్న శ్రీభూగోదా అండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణమహోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేషపూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రీలక్ష్మీపద్మావతి అమ్మవారికి మహాపూర్ణాభిషేకం, 108 పద్మపుష్పాలతో మహాలక్ష్మీ హోమం వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి రాధా కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం హారతి, సాయంత్రం వేదసదస్సు, సదస్యం కార్యక్రమాలు జరిగాయి. ఈకల్యాణమహోత్సవాలు ఈనెల 4వతేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

వెయ్యి గొంతులు-లక్ష డప్పులను విజయవంతం చేయండి

● అనపర్తిలో ఎమ్మార్పీఎస్ నాయకుల డప్పుల ప్రదర్శన


అనపర్తిలో డప్పులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనపర్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఈనెల7న లక్షల డప్పులు వేల గొంతుకలు పేరుతో నిర్వహిస్తున్న మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఎల్ఎఫ్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం అనపర్తిలో లక్షల డప్పుల కార్యక్రమం విజయవంతం కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక సంఖ్యలో మాదిగ సోదరులు ఈకార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు డోకుబుర్ర రాజబాబు, నాయకులు నూతిక బాబూరావు, పెడిమళ్ళ స్వామి, బత్తిన ఆనందరావు, కొమ్మరి అబ్రహం, రవికుమార్ పాల్గొన్నారు.

కోరుకొండలో రూ.6.10లక్షలతో ఆలయాల అభివృద్ధి


కోరుకొండలో పలు ఆలయాల అభివృద్ధికి సొంత నిధులు విరాళంగా అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో పలు దేవాలయాల అభివృద్ధి కోసం రూ.6.10లక్షలు విరాళాలుగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం కోరుకొండ మండలం కాపవరం పాశలమ్మ అమ్మవారి ఆలయంవద్ద నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి సంబంధించి అభివృద్ధిపనుల కోసం రూ.4లక్షలు, వడ్డీలపేట రామాలయంలో విగ్రహాల ఏర్పాటు కోసం రూ.1.60లక్షలు, కాపవరం పాశాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం రూ.50వేలు ఆయా ఆలయ అభివృద్ధి కమిటీలకు అందజేశారు. అనంతరం మహిళల కోసం లక్కీ డ్రా నిర్వహించి డ్రాలో గెలుపొందిన 200 మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అయ్యప్ప, బాపన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాధ శర్మ, కట్టా కల్యాణ్, బత్తుల నానాజీ, త్రిమూర్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సీతానగరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 1981-82లో సీతానగరం పువ్వాడ సత్యమాంబ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఇనుగంటి వారిపేట షిర్డిసాయి ఫంక్షన్ హాలులో దేవానంద్, పల్లేటి రామకృష్ణ ఆధ్వర్యంలో కలుసుకుని సందడి చేశారు. గత స్మృతులను తలుచుకుని ఆనందంగా గడిపారు. ప్రతీ సంవత్సరం కలుసుకోవడమే కాకుండా తోటి విద్యార్థులకు అత్యవసర పరిస్థితులు వస్తే ఆదుకునేందుకు ఒక నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.


ఒకేచోట కలిసిన 1981-82 పదో తరగతి విద్యార్థులు

ఇథనాల్ పరిశ్రమ నిర్వహణ చట్టవిరుద్ధం

● మానవ హక్కుల వేదిక సభ్యులు డిమాండ్

గోకవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నిర్వహణ పూర్తిగా చట్ట విరుద్ధమని, తక్షణమే ఆ కంపెనీని అక్కడి నుంచి తొలగించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. రాజేష్, కార్యదర్శి జి.రోహిత్, జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. అస్సాగో పరిశ్రమ బాధితుల నుంచి నిజనిర్ధారణ చేసేందుకు ఆదివారం వారు గుమ్మళ్ళదొడ్డి విచ్చేసి, పరిశ్ర మను ఆనుకొని ఉన్న దళితవాడను, మరికొన్ని ఇతర ప్రాంతాలను పరిశీలించారు. ఇథనాల్ పరిశ్రమ రెడ్ కేటగిరి పరిశ్రమలోకి వస్తుందని, ఇటువంటి పరిశ్రమలు ఊరికి, పొలానికి దూరంగా నిర్మించాలని కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనలు తెలియజేస్తున్నాయన్నారు. ఈవిషయాలను పరిగణలోకి తీసుకొని అస్సాగో పరిశ్రమను గుమ్మళ్ళదొడ్డి నుంచి తొలగించాలని మానవ హక్కుల వేదిక సభ్యులు డిమాండు చేశారు.

రాజానగరం బ్లాక్ 2 కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

సీతానగరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ రాజానగరం నియోజకవర్గం బ్లాక్-2 అధ్యక్షుడిగా గుండుబోగుల శ్రీనివాసరావు (రంగా శ్రీను) ఎంపికైనట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి వడియార్ శ్రీను తెలిపారు. ఆదివారం సీతానగరం బస్టాండ్ సెంటర్ సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద వడియర్ శ్రీను, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రంగా శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రంగా శ్రీను మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచి నమ్మకానికి అనుగుణంగా పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దుళ్ళ సూర్యనారాయణ, ఆకుల శేషగిరి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కన్నుల పండువగా కుంభాభిషేకం


భక్తులతో కలసి గోపురాలకు అభిషేకం చేస్తున్న డాక్టర్ రాంబాబు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని కుమార క్షేత్రం లో కొలువై ఉన్న శ్రీహేరంబగణపతి, బాలకుమారస్వామి సహిత శ్రీవిశ్వేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆలయ నిర్మాణ దాతలు కంభంపాటి వెంకట రామ సుబ్రహ్మణ్యం (లక్ష్మీ రాంబాబు డాక్టర్) దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం కుంభాభిషేక కార్యక్రమం ఆదివారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో మూడురోజులుగా జరిగిన అరుణహోమం, చండీహోమం, మహాలక్ష్మీ హోమాలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. 20మంది పండితులు బృందం అమ్మవారికి ముత్యాలతో, హేరంబగణపతి, బాలకుమారస్వామిలకు పగడాలతో రాంబాబు దంపతులు అభిషేకం జరిపారు. తర్వాత భక్తులతో కలసి రాంబాబు ఆలయంపై నుంచి బిందెలతో జలంతో, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేసారు. కార్యక్రమంలో స్థానికులు, పరిసరగ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మిర్తిపాడులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

సీతానగరం, ఫిబ్రవరి 2: మండలంలోని మిర్తిపాడు గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.ఒక వర్గం యువకులు మరో వర్గం యువకులను కామెంట్ చేయ డంతో ఏమిటని ప్రశ్నించగా వారిని తీవ్రంగా కర్రలతో కొట్టారు. ఒక సామాజికవర్గం వ్యక్తి ఆది వారం మరణించడంతో అక్కడకు వచ్చిన యువకులు యువకులను కొట్టిన విషయం తెలుసుకుని రాత్రి 7 గంటలకు కర్రలతో సర్పంచ్ వీధిలోకి వచ్చి వీరంగం చేయడంతో అక్కడ భయానక వాతావరణం ఏర్పడింది. దీంతో ఇరు సామాజిక వర్గాలు యువకులు కొట్టుకోవడంతో పలువురికి తీవ్ర గాయాల య్యాయి. సమాచారం అందుకున్న సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ సిబ్బం దితో సంఘటనా స్థలానికి చేరుకుని రెండువర్గాల యువకులను చెదరగొట్టారు. గాయపడిన ఇరువర్గాల వారు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు.

పట్టాల కోసం నేడు రెవెన్యూ కార్యాలయం ముట్టడి

గోకవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరామపట్నం గ్రామంలో గత రెండు దశాబ్దాలగా నిరుపేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూమికి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 3న రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టిడించే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. శివరామపట్నం గ్రామంలో రైతు కూలీ సంఘం కూలీలతో ఆదివారం ఆయన సమావేశమై ఈవిషయాన్ని వెల్లడించారు. గత ప్రభుత్వ హయంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వేలో గత అధికార పార్టీ నేతల మామూళ్ళకు తలొగ్గిన అధికారులు తప్పుడు ధృవపత్రాలు సృష్టించిన భూస్వాములకే కొమ్ముకాసే ప్రయత్నం చేసారని విమర్శించారు. ఈసమావేశంలో సంఘం నాయకులు బి.రమేష్, కడితి సతీష్, డి.సురేష్, అర్జున్, బాబు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇనుగంటివారిపేటలో సూర్యారాధన

సీతానగరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇనుగంటివారిపేట గ్రామంలోని షిర్డి సాయి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యారాధన, సూర్యనమస్కారాలు, సూర్య హోమం, గోపూజ నిర్వహించారు. పురోహితులు ఎ.సూర్యనారాయణ, వడలి శివ సుబ్రహ్మణ్య శర్మలు మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. మాఘమాసంలో ప్రత్యేకంగా సూర్య ఆరాధన చేయడం జరుగుతుందని, మాఘ మాసం ప్రారంభం నుంచి మాఘ పౌర్ణమి వరకుకార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈనెల8న ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తామన్నారు.




వేంకటేశ్వరుడి పాదముద్రలు

మార్చి 8 వరకు పీజీఆర్ఎస్ నిలుపుదల

కలెక్టర్ ప్రశాంతి వెల్లడి



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న మార్చి 8వ తేదీ వరకు పీజీఆర్ఎస్‌ను నిలుపుదల చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ మేరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరగదన్నారు. ఎన్నికల నియమావళి పూర్తయ్యే వరకు జిల్లా,రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో పీజీఆర్ఎస్ జరగదన్నారు. ప్రజల ఫిర్యాదుల నమోదుకు సంబంధిత సచివాలయాన్ని సందర్శించవచ్చన్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు ఫిర్యాదులు సమర్పించడానికి మీకోసం ఆన్‌లైన్ పోర్టల్ ఉపయోగిస్తామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు గ్రహించి కలెక్టరేట్, డివిజన్ , మండల కేంద్రాలకు రావొద్దని తెలిపారు.

ప్రభుత్వ బకాయిలకు ఉద్యమిస్తాం

యూటీఎఫ్ నాయకుల వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించకపోతే బకాయిల కోసం ఉద్యమిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ప్రకటించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.12వ పీఆర్‌సీ కమిషన్‌ను ప్రభుత్వం నియమించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే కమిషన్ నియమించాలన్నారు. బకాయిలకు దశలవారీ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. కోశాధికారి ఈ వీఎస్ఆర్ ప్రసాద్, ఉపాధ్యక్షులు విజయగౌరీ, ఐ.రాంబాబు పాల్గొన్నారు.

మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు 8

గోదారంతా.. ఘాట్!


రాజమహేంద్రవరం పుష్కరఘాట్

పుష్కరాలకు అటూ ఇటూ ఒకటే ఘాట్

- 2027 పుష్కరాలకు ఏర్పాట్లు
- 17 ఘాట్ల విస్తరణకు యోచన
- ఇప్పటి నుంచే ప్రణాళిక
- రూ.300 కోట్లతో ప్రతిపాదన
- రాజమండ్రి వైపు 7.1 కి.మీ
- కొవ్వూరు వైపు 2 కి.మీ
- ఎంపీ పురందేశ్వరి ఆదేశాలు
- అధికారుల తర్జనభర్జన
- ఏటిగట్టు రోడ్డు నిర్మాణం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ముందస్తు చర్యలకు దిగుతున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి పరీవాహక ఘాట్లు లింక్ చేసే యోచన చేస్తున్నారు. రాజమహేంద్రవరం వైపు కాతేరు నుంచి ధవళేశ్వరం వరకూ 7.1 కి.మీ, కొవ్వూరు వైపు గోష్పాదక్షేత్రానికి అటూ ఇటూ విస్తరించనున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రయాగలో జరుగుతున్న మహా కుంభమేళాను దృష్టిలో పెట్టుకుని 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది.ఇప్పటి నుంచే గోదావరి పుష్కరాలకు సర్వం సన్నద్ధం కావడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలో గోదావరి పరిసర గ్రామాలన్నింటికీ పుష్కర శోభను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుంది.

గత పుష్కరాలకు ఇలా..

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవుకు దీటుగా 2003 పుష్కరాలకు కోటిలింగాల రేవును అప్పటి టీడీపీ ప్రభుత్వం 1.2 కిమీ విస్తరించింది.అప్పట్లో ఈ ఘాట్‌లోనే అత్యధికంగా భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. 2003 పుష్కరాలకు ఘాట్ల అభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయింపులు చేశారు.అప్పట్లోనే కొవ్వూరు గోష్పాదక్షేత్రం ఘాట్‌ను అభివృద్ధి చేశారు. అటుపై 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు, సర్వస్వతి ఘాట్ అభివృద్ధి చేశారు.పుష్కరాల రేవు కేవలం ప్రధాన మంచినీటి విభాగం సరిహద్దు గోడ నుంచి ఆర్చి బ్రిడ్జి వరకు మాత్రమే ఉండేది దానిని చిత్రాంగి గెస్ట్ హౌస్ వెనుక వరకు విస్తరించారు.నాటి పుష్కరాల్లో పుష్కరాల రేవు,కోటిలింగాలరేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్, కాతేరు రేవు, ధవళేశ్వరం రేవులు ప్రధాన భూమిక పోషించాయి.అయినా రద్దీ అంతా రాజమహేంద్రవరం పుష్కరాలరేవు, కోటిలింగాల రేవులపై పడేది. ఈ నేపథ్యంలో గత రెండు పుష్కరాల అనుభవాలు, ప్రస్తుతం ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి పొడవునా ఉన్న రేవులను ఈ సారి పుష్కరాలకు వినియోగించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతుంది.

రోడ్లు విస్తరణ

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రేవులకు అనుసంధానంగా ఉన్న గోదావరి బండ్ రోడ్డును విస్తరించే యోచనలో ప్రజాప్రతినిధులు అధికారులు ఉన్నారు. ధవళేశ్వరం సాయిబాబా ఆలయం నుంచి ఉన్న గోదావరి బండ్ రోడ్డును రాజమహేంద్రవరం బండ్ రోడ్డు,శేషయ్యమెట్ట మీదుగా కోటిలింగాల రేవు, కాతేరు, వెంకటనగరం మీదుగా ఏటిగట్టును బేస్ చేసుకుని గోదావరి బండ్ రోడ్డును నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పుష్కరాలకు కోట్లాదిగా తరలి వచ్చే భక్తజనం రాజమహేంద్రవరం వరకు రాకుండానే రూరల్‌లో గోదావరి బండ్ రోడ్డులోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చేసిన ఘాట్ల స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యే విధంగా బండ్ రోడ్డుకు మెయిన్ రోడ్లను కనెక్ట్ చేసి నిర్మించాలనే చర్యలు అధికారులు చేపట్టనున్నారు.


కొవ్వూరు గోష్పాదక్షేత్రం రేవు

2027 గోదావరి పుష్కరాలకు ఇలా..

గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు ఘాట్లలో భక్తజనం పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు ప్రధానంగా ఉన్న ఘాట్లను ఇంటర్ లింక్ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టనున్నారు. ఎంపీ పురందేశ్వరి కూడా రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఘాట్లను లింక్ చేయాలని ఆదేశించారు.ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నగరంలో ఉన్న కోటిలింగాల రేవు నుంచి కాతేరుకు, ఇటు వైపు పుష్కరాల రేవు, కుమారి ఇసుక ర్యాంప్ రేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, దోబీఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, ధవళేశ్వరం రామపాదాల రేవులను ఇంటర్‌లింక్ చేసి సుమారు 7.1 కిలోమీటర్ల పొడవునా అతిపెద్దగా ఘాట్లను నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగం చేస్తుంది. కొవ్వూరు వైపు సుమారు 3 కిలోమీటర్ల మేర అఖండ గోదావరి ఉంది. అక్కడ సుమారు 2 కి.మీ గోష్పాదక్షేత్రం నుంచి అటూ ఇటూ రేవులను విస్తరించే యోచనలో యంత్రాంగం ఉంది. 2027 గోదావరి పుష్కరాలకు ఘాట్ల ఇంటర్ లింక్‌లు కలిపి మొత్తం 17 ఘాట్లను సిద్ధం చేసేందుకు సుమారు రూ.300 కోట్లు నిధులు కేటాయింపులు చేసే యోచనలో ఉన్నారు. ఇదే జరిగితే పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానాలు చేసి వెళ్లే పరిస్థితి ఉంటుంది.అన్ని రేవులను కలిపి పుష్కరాల రేవుగా నామకరణ చేసి బోర్డులు కూడా అందరికి స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేయాలనే ఆలోచన అధికారులు చేస్తున్నారు.ఎందుకంటే 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు వద్ద తొలిరోజు జరిగిన ప్రమాదంలో 22 మంది వరకూ మృత్యువాత పడిన ఘటన విదితమే.ఈ నేపథ్యంలో ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రేవులు లింక్ చేసేయోచన చేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా ఘాట్లు



కొవ్వూరు గోష్పాదక్షేత్రం లోని పిండ ప్రదానాల రేవు నుంచి క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు ప్రస్తుతం 200 మీటర్ల పొడవు ఉన్నాయి. భక్తుల రద్దీ తట్టుకునే విధంగా ఘాట్లను పొడిగించాలని ఆలోచన. గోష్పాదక్షేత్రంలోని పిండ ప్రదానాల రేవు నుంచి గామన్‌బ్రిడ్జి వద్ద ఉన్న గౌతమి ఘాట్ వరకు ఒకే ఘాట్ నిర్మాణం చేపట్టాలని ఆలోచన.అది సాధ్యం కాక పోతే గోష్పాదక్షేత్రం నుంచి సుబ్రహ్మణ్య ఘాట్ వరకు 1200 మీటర్ల పొడవునా ఒకే ఘాట్.ప్రస్తుతం విజ్జేశ్వరం నుంచి పట్టిసీమ వర కు 13 ఘాట్లు ఉన్నాయి. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తాం. - ముప్పిడి వెంకటేశ్వరరావు,ఎమ్మెల్యే, కొవ్వూరు

రద్దీకి తగ్గట్టు ఘాట్ల విస్తరణ



2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ప్రస్తుతం జరుగుతున్న మహాకుంభమేళాకు వచ్చిన భక్తజనానికి మించి భక్తులు వచ్చే అవకాశం ఉంది. అందుకే రద్దీకి తగ్గట్టుగా ఘాట్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటుంది. అన్ని ఘాట్లు పుష్కరఘాట్లే ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుష్కర పుణ్యమే అనే ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని రేవులకు ప్రజలు సమాంతరంగా వచ్చే విధంగా ప్రణాళికను ప్రభుత్వం చేస్తుంది. 2027 గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటి నుంచే పుష్కరాల అభివద్ధి పనులు చేపడుతున్నందున అన్ని సకాలంలో పూర్తవుతాయి.

- ఆదిరెడ్డి వాసు,ఎమ్మెల్యే, రాజమండ్రి


తంటికొండ వేంకటేశ్వరస్వామి

నేటి నుంచి తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం తంటికొండ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంక టేశ్వరస్వామి 65వ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.. ఆల యాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. 9వ తేదీ వరకూ అంటే వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ,ముగ్గుల పోటీలతో పాటు, పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ సారి కొత్తగా బ్రహ్మోత్సవాల్లో హైదరాబాద్ వారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు.

బాలికను కిడ్నాప్ చేసి.. లెక్చరర్ అత్యాచారం

జూనియర్ లెక్చరర్‌పై పోక్సో కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన ప్రైవేటు కళాశాల జూనియర్ లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన 17 సంవత్సరాల బాలిక రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. అదే కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తిరుపతికి చెందిన వినయ్‌వర్ధన్ ఈ నెల 28వ తేదీన బాలికను మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 29వ తేదీన పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం బాలిక అతని వద్ద ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు మిస్సింగ్ కేసును ఆదివారం పోక్సో కేసుగా మార్చినట్టు ఎస్ఐ తెలిపారు.



గోకవరంలో వర్రీయే!

పండిన ప్రతి గింజనూ కొంటాం..48 గంటల్లో సొమ్ము జమ చేస్తాం. ఇదీ అధికారులు .. నాయకుల మాట.. లక్ష్యం మేరకు కొనుగోళ్లు జరిపారు.. అయితే ఎక్కడి పంట ఎక్కడైనా అమ్ముకోవచ్చనే నిబంధన కారణంగానో ఏంటో గోకవరం మండలంలో 8 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది.ఆ ధాన్యం చాలా కాలం కిందటే మిల్లులకు తరలించినా ఇంకా సొమ్ములు మాత్రం జమకాలేదు.. దీంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

- రైతుల వద్ద 8 టన్నుల ధాన్యం
- డిసెంబరులో మిల్లులకు తరలింపు
- ఇంకనూ జమకాని డబ్బులు
- లబోదిబోమంటున్న రైతాంగం

గోకవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు కొత్త కష్టం వచ్చి పడింది. పండిన పంటను విక్రయించుకునేందుకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు విడుదల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత కొంత కాలంగా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణను పూర్తిగా నిలిపేసింది. జిల్లా టార్గెట్ పూర్తయిందన్న షాకుతో ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా ప్రభుత్వం ఆపేసింది. దీంతో తమ వద్ద ఉన్న ధాన్యం ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో రైతాంగం కొట్టుమిట్టాడుతున్నారు. కొంత మంది రైతులు డిసెంబరు నెలలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడడంతో అనధికారికంగా రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని పంపేశారు. కానీ మిల్లర్లకు కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో రైతుల ఖాతాలో ఇంత వరకూ డబ్బులు జమకాలేదు. దీంతో బాధిత రైతాంగం డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాలంటూ ప్రస్తుతం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మండలంలో 48 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయగా కూటమి ప్రభుత్వంలో 40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించి చేతులు దులుపేసుకుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గోకవరం మండలంలో రైతుల వద్ద ఇంకనూ 8 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

టార్గెట్ పూర్తయిపోయింది..

టార్గెట్ పూర్తవ్వడం వల్ల రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించలేకపోతున్నాం.ప్రభుత్వం నుంచి అనుమతి లభించే వరకు రైతులు ధాన్యం తమ వద్దే ఉంచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా ధాన్యాన్ని మిల్లర్లకు పంపి ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.

- సాయిప్రసాద్, తహశీల్దార్, గోకవరం



దాదాగిరి.. దందాలు..

- ఇంకనూ ఆగని సెటిల్‌మెంట్లు
- కూటమి సర్కారులోనూ ఇదే తీరు
- కన్నెత్తిచూడని పోలీసులు
- రౌడీలకు రాజకీయ రంగు
- మళ్లీ భయపడుతున్న జనం
- లా అండ్ ఆర్డర్‌కు సవాల్
- 7 నెలల్లో 70 మందిపై రౌడీషీట్
- అయినా మారని తీరు
- జిల్లాలో పెరుగుతున్న నేరాలు

జిల్లాలో రెచ్చిపోతున్న రౌడీమూకలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రౌడీమూకలు రెచ్చిపోతున్నాయి.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. అయినా పోలీసులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజమహేంద్రవరం కేంద్రంగా రౌడీ మూకలు విచ్చలవిడిగా పెరిగాయి. నగరంలో ఒంటరిగా తిరగాలంటేనే భయపడేంతగా జనం వణికిపోయారు. అమ్మో రాజమహేంద్రవరం అన్నారు. ఎందుకంటే ఎటు చూసినా బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలే. కూటమి ప్రభుత్వం రావడంతో ఆ బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు తగ్గినా రౌడీమూకల ఆగడాలు మాత్రం అలాగే ఉన్నాయి. అయినా పోలీసులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

రెచ్చిపోతున్న రౌడీమూకలు..

ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీకి సంబంధంలేని రౌడీషీటర్లు సైలెంట్‌గా ఉండగా గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ అండతో రెచ్చిపోయిన కొంత మంది మాత్రం ఇప్పటికీ చెలరేగిపోయి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.జిల్లాను అనేక ఘర్షణలకు కేంద్రంగా మార్చివేస్తున్నారు.లాండ్ ఆర్డర్‌కు సవాల్ చేస్తూ అన్ని అసాంఘిక కార్యకలాపాల్లో తలదూర్చి దందాలు చేస్తున్నారు. చిన్న తగాదా మొదలుకొని పెద్దపెద్ద సెటిల్‌మెంట్ల వరకు యథేచ్ఛగా రూల్స్‌ను బ్రేక్ చేస్తున్నారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా వీక్ చేస్తున్నారు. గత ఎన్నికల్లో నగరంలో ఒకరిద్దరు రౌడీషీటర్లకు గట్టిదెబ్బతగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గొంతులో వెలక్కాయపడినట్లయింది. ఇదంతా కేవలం నెలరోజులు మాత్రమే.. ఎందుకంటే ఆ నెలా సైలెంట్ అయిన వారు అటుపై మళ్లీ తమ హవా కొనసాగించేందుకు తెరమీదకు వస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా చాపకింద నీరులా తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. రౌడీషీటర్ అనే ముద్రను తొలగించుకునేందుకు వారికి అండగా నిలిచిన పార్టీ పదవులను పొంది ప్రజల్లోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో రోడ్లపై పొడుచుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా చాలా మంది మహిళలను భయపెట్టిన చరిత్ర ఉన్న వాళ్ళు వాటిని చెరుపుకునే ప్రయత్నం చేస్తున్నారు.అయితే వారిలో ఉన్న నేర స్వభావం వారిని ఊరకనే ఉండనివ్వదు కాబట్టి అడపాదడపా అసాంఘిక పనులు చేసుకుంటూ మళ్లీ తెరపైకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల వైసీపీకి చెందిన రౌడీషీటరు ఒక మహిళను ట్రాప్ చేశారు. ఆ మహిళ చేత ఆమె కుటుంబంలో చిచ్చుపెట్టించి గందరగోళం సృష్టించాడు. చివరికి ఆమెకు ఆమె భర్తకు మధ్య పెద్ద ఆగాధం సృష్టించాడు. ఇటువంటి వారిని అరికట్టడంతో కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజమహేంద్రవరంలో కొత్తగా సుమారు 70 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. కానీ గత ఐదేళ్లలో విచ్చలవిడిగా వ్యవహరించిన వారిపై చర్యలు కానరావడం లేదు. దీంతో రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి..మళ్లీ రోడ్డెక్కుతున్నాయి.


రాజమహేంద్రవరంలో అధికారులకు సూచనలు చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర పాటిల్

గోదావరి పుష్కరాలకు సన్నద్ధం కావాలి

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ తనిఖీలో డీఆర్ఎం నరేంద్ర పాటిల్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రానున్న పుష్కరాల రద్దీకి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేంద్ర ఎ.పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల మూడో వారంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీకి రానున్న నేపథ్యంలో ఆదివారం డీఆర్ఎం,ఏడీఆర్ఎం శ్రీనివాసరావుతో కూడిన ఉన్నతాధికారుల బృందం రైల్వేస్టేషన్‌ని పరిశీలించింది. డీఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం రూ270 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పుష్కరాల నాటికి పూర్తి కావాల్సి ఉందన్నారు.గతిశక్తి బ్లూప్రింట్‌ని పరిశీలించి ఎక్కడెక్కడ ఏమేమి సదుపాయాలు వస్తాయో ఆరా తీశారు. ఐదు ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు సంచరించే ప్రదేశాలను చూశారు.తూర్పు రైల్వే స్టేషను వైపు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇటువైపు ఐదు అం తస్తుల భవనం రానున్న నేపథ్యంలో అవసర మైతే జీఎం వచ్చినప్పుడు ఆయనతో శంకుస్థాపన చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. పరిశుభ్ర తలో రాజీ పడొద్దని ఆదేశించారు.భద్రతకు తొలి ప్రాధా న్యం ఇవ్వాలన్నారు.రోడ్ కం రైలు బ్రిడ్జిని తనిఖీ చేశారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న పిక్కి నాగేంద్ర

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆగ్రరాజ్యాలకు దీటుగా భారతదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. ఆదివారం కొవ్వూరులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ లక్ష్య వికసిత భారత్ అని, పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ రంగాల వారీగా చూస్తే దేశ సమగ్రాభివృద్ధి సాధించడానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ.2.50 లక్షల వార్షికాదాయం వస్తే ఆదాయ పన్ను చెల్లించమని, నేడు మోదీ నాయకత్వంలో మధ్య తరగతి ప్రజలకు రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను పై ఊరట కల్పించారన్నారు. దేశం పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వే జోన్, అమరావతి నిర్మాణం, విశాఖ ఉక్కుకి నిధుల కేటాయింపుపై మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, నలచి సందీప్‌కుమార్, మాట్రా ఆంజనేయులు,పోసాని పవన్ పాల్గొన్నారు.

మంద కృష్ణ కృషితో ఎస్సీ వర్గీకరణకు బీజం

మాదిగ రక్షణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్



చీపురుగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేఖర్

నల్లజర్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణకు బీజం పడిందని మాదిగ రక్షణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కందిల్లి శేఖర్ అన్నారు. మంద కృష్ణకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆదివారం చీపురుగూడెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మోదుగ సుబ్బారావు, వసంతాద ఆనందస్వరూప్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మంద కృష్ణ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందించిందన్నారు. మాదిగలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు-వేల గొంతులు మహా ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గెడా శ్రీను, పెనుమాక వెంకటరత్నం, రాజేశ్వరరావు, యర్రా జగదీష్, మోదుగ ధర్మారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సూర్యనారాయణుడికి పంచామృతాభిషేకాలు



సూర్యభగవానుడి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వర స్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తికి ఆదివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయార్చకుడు సుందర గణేష్ ఆధ్వర్యంలో సూర్యనారాయణుడికి పంచామృత అభిషేకాలు, ఆదిత్య హృదయ పారాయణం చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణబ్రహ్మ శివాలయంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సూర్య భగవానుడి ఉత్సవ మూర్తులను అశ్వ రథంపై ఏర్పాటుచేసి పట్టణ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూర్య ఉపాసకులు విక్రమాదిత్య, ఆలయ కమిటీ చైర్మన్ ఆసపల్లి శివరామకృష్ణ, దొర్ల ప్రభాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు ఎమ్మెల్యే బొలిశెట్టి పూజలు

రూ.1,40,977 ఆదాయం



కోటసత్తెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

నిడదవోలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు, క్షీర, మహానివేదనలు చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావ డంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళ లాడింది. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ.1,40,977 ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ వీరవల్లి సూర్యప్రకాశ్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు. కాగా అమ్మవారిని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు హరి సూర్యప్రకాష్, రవిశంకర్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయార్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఎమ్మెల్యే వెంట జనసేన నాయకులు డాక్టర్ కత్యాశ్రీచక్రవర్తి, ఆయినీడి పల్లారావు తదితరులు ఉన్నారు.

పోలవరం కుడి కాల్వకు నీరు



శింగరాజుపాలెంలో పోలవరం కుడి కాల్వకు చేరిన సాగు నీరు

నల్లజర్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలో ఉన్న పోలవరం కుడి కాల్వకు అధికారులు నీరు విడుదల చేశారు. పోలవరం కుడి కాల్వకు నీరు విడుదల చేయాలని ఆనే శీర్షికతో గత నెల 16న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రబీ పంటకు సాగు నీరందే విధంగా కృషి చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు ఒక వంపి నీరు విడుదల చేయ డంతో దేవరపల్లి, నల్లజర్ల మండల రైతులకు సాగు నీటి ఇబ్బందులు తొలగిపోయాయి.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నల్లజర్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విభిన్న ఆలోచనలు, క్రియేటివిటీతో ముందుకు పోవాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. దూబచర్ల ఎలైట్ కళాశాలలో ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఆదివారం ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. మదిరేపల్లికి ఎపిటివి చీఫ్ మేనేజర్ వీరబాబు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ద పులూరి ప్రభాకరావు, డైరెక్టర్లు యలమర్తి సుదర్శనం, సుబ్బారావు, సోమశేఖరం పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

నిడదవోలు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నిడదవోలులో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చైర్మన్ భూపతి ఆది నారాయణ ఆదేశాలతో ఆదివారం ఆది రోజులుగా మెయిన్‌రోడ్డు, బస్టాండ్, విరెడ్డిపేట తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు.



నిడదవోలులో ఫాగింగ్ చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

రోడ్డూ ఆక్రమించేయ్!

» ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో పెరుగుతున్న పాత ఇనుప సామాన్ల దుకాణాలు
» విద్యుత్‌వైర్లు, రబ్బరు కాల్చివేత
» వాటి నుంచి వెలువడుతున్న పొగ
» ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



రోడ్డు పక్కన పడవేసిన పాత ఇనుము, ప్లాస్టిక్ సామగ్రి



తాళ్లపూడి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో పాత ఇనుప సామాన్ల షాపులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఈ రెండు గ్రామాల నుంచి గజ్జరం గ్రామం వైపు వెళ్లే దారి వెంబడి ఉన్న ఈ షాపుల కారణంగా ఆ రహదారిలో ప్రయాణం చేసేవారు చాలా ఇబ్బందులకు గురౌతున్నారు. రోడ్డు మార్జిన్‌ను సైతం ఆక్రమించి పాత ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ సామాన్లు వేస్తున్నారు. అలాగే పాడైపోయిన రబ్బరు, రాగివైర్ కోసం కరెంటు వైరులను రోడ్డు పక్కనే కాల్చుతున్నారు. దీని వల్ల వచ్చే పొగతో ఆ దారిలో ప్రయాణాలు చేసే వారు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ కార్యకలాపాలపై అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారని పలువురు నాయకులు అంటున్నారు. పాత సామాన్ల కోసం తీసుకువచ్చిన వాహనాలను సైతం ఇక్కడ స్పేర్ పార్టులుగా మారుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ చిన్నబ్బాయి మాట్లాడుతూ పాత సామాన్ల షాపుల నిర్వహణను నియంత్రించే వారు కానీ, చర్యలు తీసుకునే వారు కానీ లేరన్నారు. గతంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావించినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామా నుంచి గజ్జరం వెళ్లే రహదారిలో ఒకనాడు ఇటుక బట్టీల నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ప్లాస్టిక్ వైర్లు, పాతరబ్బర్లు కాలుస్తుండడంతో వచ్చే మరో రకమైన కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

సేవ్ గోదావరి కార్యక్రమం

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్‌కు చెందిన 80 మంది వలంటీర్లు ఆదివారం సేవ్ గోదావరి కార్యక్రమం నిర్వహించారు.పుష్కర్ ఘాట్ వద్ద నదిలో వ్యర్థాలను తీసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, డీఎస్పీ కె.రమేష్‌బాబు, పీపీ ఎస్ కృష్ణారావు, కెనుదారు పట్నాయక్, చందనరావు, ఎంహెచ్‌వో వినూత్న పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ వీరబాబు

నిడదవోలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని సమిశ్రగూడెం ఎస్ఐ వీరబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం సమిశ్రగూడెం జంక్షన్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై యువకులకు అవగాహన కలిగించారు.

'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురికి ఆర్థిక సాయం అందించినట్టు సంస్థ బాధ్యుడు కందెపు వెంకట సూర్యనారాయణ తెలిపారు. పుల్లలపాడుకు చెందిన దివ్యాంగుడు గడాని వెనిలియ్యకు వీల్‌చైర్ బహూకరించగా క్యాన్సర్ బాధితుడు సీహెచ్‌వీ సుబ్బారావుకు ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో గుళ్లపూడి వెంకటరత్నం, ఐదీవీ అప్పారావు, గుత్తికొండ ప్రసాద్, బలుసు గంగరాజు, వెల్లి సుబ్బారావు, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం
రూ.6 లక్షల ఆస్తినష్టం

సూర్యనారాయణపురంలో ఘటన



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, దగ్ధమైన పొగాకు



దేవరపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యనారాయణపురంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు పుట్ట రామారావు బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా గొట్టాలపై ఆకులు పడడంతో మంటలు సంభవించి బ్యారన్ పూర్తిగా దగ్ధమైంది. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కాకినాడ మహాసభకు తరలిన ఉద్యోగులు



కాకినాడలో జరిగే ఏపీజీఈఏ సమావేశానికి వెళ్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కాకినాడలో ఆదివారం నిర్వహించిన మహాసభకు కొవ్వూరు నుంచి ఉద్యోగ సంఘ నేతలు తరలివెళ్లారు. ఉద్యోగుల ఐక్యతను చాటిచెప్పడం, విధి నిర్వహణలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంపై మహాసభలో చర్చించినట్టు చెప్పారు. కొవ్వూరు తాలూకా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏపీజీఈఏ సభ్యులు కొవ్వూరు నుంచి 2 బస్సుల్లో కాకినాడ వెళ్లారు.

సుందరసాయి ఆలయ వార్షికోత్సవాలు



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో షిరిడి సాయినాథ్ విగ్రహ ప్రతిష్ఠ 30వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కలశస్థాపన, శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం, శ్రీమహా గణపతి యాగం, గణపతి హోమం, హనుమాన్ చాలీసా పారాయణము, కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుడిపాటి శ్రీనివాసరావు, సీహెచ్ సుబ్బారావు, కసిరెడ్డి సీతారామయ్య, కొట్ల సత్యవంధ్య, గణేష్, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

సీఆర్‌పీల సమస్యల పరిష్కారానికి కృషి

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరం



సమావేశంలో మాట్లాడుతున్న పేరాబత్తుల రాజశేఖర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీల ఉద్యోగ భద్రత, కనీస వేతనాల అమలు వంటి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. రాజమహేంద్రవరం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా సీఆర్‌పీ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జరగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గిరి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎం.రమునాథ్, స్టేట్ సీఆర్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ తవిటి నాయుడు, సెక్రటరీ యేసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి షూనలరావు పాల్గొన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని రాష్ట్ర కార్యదర్శి కేవీఎంఎల్‌ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన జేవీవీ జిల్లా ప్లీనరీకి హాజరై మాట్లాడారు. చెడు అలవాట్ల నుంచి యువతను కాపాడుకోవాలని కి వేదిక కార్యకర్తలను కోరారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.బీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవిబాబు, ఉపాధ్యక్షులుగా వసంతరావు, ఏఎన్ సుధారాణి, శ్రీరాములు, కోశాధికారిగా తాతారావు, గౌరవాధ్యక్షులుగా మల్లి కార్జునరావు, పైడియ్య, డాక్టర్ చైతన్యశేఖర్ తదితరులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రూరల్ జనసేన కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడింగొయ్యి గ్రామంలో జూరా హోటల్ పక్కన ఏర్పాటు చేసిన జనసేన పార్టీ రూరల్ కార్యాలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దు ర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మేడా శ్రీనివాస్ చేతులమీదుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేడా శ్రీనాథ్, మంత్రి దుర్గేష్

మహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

దేవరపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంలో గౌరీసమేత మహాలింగేశ్వరస్వామి పరివార దేవతలు జీవ ధ్వజస్తంభంతో ప్రతిష్ఠాపన మహాకుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం గౌరీసమేత మహాలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ దేవతలకు దేవస్థానం తరపున పసుపు, కుంకుమ, చీర, సారె చదివించి, పొంగళ్లు సమర్పించారు. సాయంత్రం ఆలయం వద్ద వేద పారాయణం, గోపూజ, బింబశుద్ధి, ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, ప్రతిష్ఠ సంకల్పం, పంచగవ్య అఖండ దీపారాధన, అంకురారోపణ, నీరాజనం జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలు దాగిల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి రావిపాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు నిర్వహించారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు 'బాలవికాస'



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఠాధిపతి అనాలయో

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బాలబాలికల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు బాలవికాస కార్యక్రమం ప్రారంభించినట్టు ఉండ్రాజవరం బౌద్ధ దమ్మపీఠం పీఠాధిపతి అనాలయో చెప్పారు. ఆదివారం ఉండ్రాజవరంలోని బౌద్ధ దమ్మ పీఠంలో బాల వికాస కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు చదువులతోపాటు వారిలో వైజ్ఞానం వెలికితీసేందుకు, నీతి సూత్రాలతోపాటు యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ధ్యానం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తామన్నారు.ఈ సందర్భంగా చిన్నారులతో చెడు పనులు, ఆలోచనలు, వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఆదివారం బాలబాలికలు బాలవికాస కేంద్రానికి రావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇవ్వడానికి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని అనాలయో చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల బాలబాలికలు, శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి తిరిగొస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన వీరమళ్ల అన్నవరం(40) శనివారం సాయంత్రం తన పొలంలో పనులు ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా గ్రామ శివారులో ఉన్న మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆతడి తలకు బలమైన గాయం కావడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు గోపాలపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

భర్త, అతడి బంధువులపై కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వివాహితపై కట్నం వేధింపులకు పాల్పడుతున్న భర్త, అతడి బంధువులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం దర్మవరం గ్రామానికి చెందిన చెముడపల్లి చిట్టిబాబు, గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన సంజయ్‌బాబుకు 2023లో వివాహం జరిగింది. కొంతకాలం తరువాత భర్త సంజయ్ బాబు, అత్త హేమలత, భర్త మేనమామ జొన్నకూటి అరుణ్‌కుమార్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పుట్టింటికి పంపించి వేశారని వికిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కె.విశ్వనాథ్‌కు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కళాతపస్వి కె.విశ్వనాథ్ ద్వితీయ వర్ధంతిని ఆదివారం జీత్ మోహన్ మిత్ర కళావేదికలో నిర్వహించారు. జిత్ మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రా గాయకులు విశ్వనాథ్ చిత్రాల్లోని గీతాలు ఆలపించి నివాళులర్పించారు.

చివటంలో తాటాకిల్లు దగ్ధం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చివటం గ్రామంలో ఆదివారం రాత్రి నీలం తులసమ్మకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమయ్యింది. తులసమ్మ భోజనం చేసి నిద్రపోవడానికి ఉపక్రమిస్తుండగా ఒక్కసారిగా మంటలు సంభవించాయి. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కట్టుబట్టలతో ఆమెను స్థానికులు బయటకు తీసుకువచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, మంచం, గ్యాస్ సిలిండర్‌తోపాటు సామానులు, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయని తులసమ్మ ఆవేదన వ్యక్తంచేసింది. స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1లక్ష ఆస్తి నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

బీజేపీ నాయకుడు రాధాకృష్ణకు పరామర్శ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తాడిపర్రు గ్రామ బీజేపీ అధ్యక్షుడు పొట్ల చెర్లు రాధాకృష్ణను పలువురు పరామర్శించారు. రాధాకృష్ణ తల్లి లింగమ్మని ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో రాధాకృష్ణ కుటుంబ సభ్యులను ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిన గోపాలకృష్ణమూర్తి, సర్పంచ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, స్థానిక సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, ఎంపీటీసీ పీఎస్ రామారావు, పలువురు కూటమి నాయకులు పరామర్శించి, తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్ స్క్రీన్ 1	: సంక్రాంతికి వస్తున్నాం
స్క్రీన్2	: ఏజెంట్ గయ్ 001
అనన్య	: మదగజరాజు
నిడదవోలు	
వీ మ్యాక్స్	: మదగజరాజు
రాధాకృష్ణ	: సంక్రాంతికి వస్తున్నాం
శ్రీగణపతి	: డాకు మహారాజ్
దేవరపల్లి	
శ్రీరామనాథ్	: గేమ్ ఛేంజర్
శ్రీనాథ్	: డాకు మహారాజ్